సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 5 । మే । 2025



మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి.. బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



దత్తాత్రేయ ఆలయంలో పూజలు

మంథని: కాటారం మండలం ధన్వాడ శ్రీదత్తాత్రేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గ్రామస్తులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0/26.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటిపూట ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. అసౌకర్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): అర్హులైన పేదలకే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెగడపల్లిలో ఆదివారం ఇందిరమ్మ గ్రామ కమిటీలతో సమీక్షించారు. ఇళ్లకు ముగ్గు పోయడం, బిల్లులు మంజూరు చేయించడం కోసం కమిటీలు అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇంటి విస్తీర్ణం 400 చదరపు అడుగులకు తగ్గినా 600 చదరపు అడుగులకు పెరిగినా బిల్లు రాదనే విషయాన్ని లబ్ధిదారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ఓ పెట్రోల్ పంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. నాయకులు సారయ్యగౌడ్, లంక సదయ్య, రామిడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

ఎలిగేడు: ధూళికట్టలోని పద్మనాయక వెలమ సంఘం నిర్మించిన పద్మనాయక కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు ప్రారంభించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మండే ఎండల్లో బారులు



గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు

ఓదెల(పెద్దపల్లి): కొలనూర్ లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద ఆదివారం వాహనాలు సుమారు అర్ధ గంటపాటు బారులు తీరాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు రామగుండం నుంచి కాజీపేట వైపు వెళ్లే గూడ్స్ రైలు నెమ్మదిగా వెళ్లడం, గేట్ వేసి ఉండడంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. మండే ఎండల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు అర్ధకిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. గూడ్స్ రైలు వెళ్లాక గేట్ తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆటోవాలాలను ఆదుకోవాలి



నినాదాలు చేస్తున్న ఆటో యూనియన్ నేతలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఆటోవాలాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ కోరారు. గతనెల 25న మెదక్‌లో ప్రారంభించిన ఆటోయాత్ర ఆదివారం పట్టణానికి చేరుకుంది. రవికుమార్ మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకంతో ఆటోలు నడవక తాము ఉపాధి కోల్పోయామన్నారు. సుల్తానాబాద్ ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల నాంపల్లి, ఆటోడ్రైవర్లు కోటగిరి స్వామి, ఐలయ్య, తిరుపతి, రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాక్ జాతీయులు వెళ్లిపోవాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పాక్ జాతీయులు దేశం విడిచి వెళ్లిపోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇందుకోసం పోలీసులు తనిఖీలు విస్తృతం చేసి పాక్ జాతీయులను గుర్తించాలన్నారు. జిల్లాకేంద్రంలోని కమాన్ వద్ద ఆదివారం పాకిస్తాన్ దిష్టిబొమ్మను బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు రాకేశ్, రమేశ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. జమ్ముకశ్మీర్ పహల్గాంలో హిందువులే లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన మారణకాండ శోచనీయమని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, ఈర్ల శంకర్, రాజం మహంతకృష్ణ, ఎర్రోళ్ల శ్రీకాంత్, పడాల శ్రీధర్, సతీశ్, పడాల శ్రీనివాస్, ఉమేశ్, అంజి, సతీశ్, వేణు, మధుకర్, శివ, సాయి, సురేందర్, మహేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూములు పంపిణీ చేయాలి

ఓదెల(పెద్దపల్లి): మడకలోని ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని హైదరాబాద్ సీసీఎల్ కలెక్టర్ కోయ శ్రీహర్షను ఆదేశించింది. ప్రభుత్వ భూమిని కొందరు భూస్వాములు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారని సీనియర్ కాంగ్రెస్ నేత గొస్కె రాజేశం ఇటీవల సీసీఎల్‌తోపాటు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో సర్వే నంబరు 510, 506, 492 లోని సుమారు 10 ఎకరాలను పేదలను గుర్తించి పంపిణీ చేయాలని సీసీఎల్ ఆదేశాలు జారీ చేసింది. స్పందించిన కలెక్టర్.. ఓదెల తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.

తాగుతూ.. ఊగుతూ..



ఈ చిత్రం గోదావరిఖని గౌతమినగర్ చౌరస్తాలోనిది. వైన్స్‌షాప్ పక్కనే ఉన్న గడ్డెపై కూర్చొని మందుబాబులు ఇలా మద్యం తాగుతున్నారు. ఇక్కడే వారసంత జరుగుతుంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారానికి ఈ మార్గం నుంచే రాకపోకలు సాగుతాయి. ఇలా బహిరంగంగా మద్యం తాగడం, మూత్ర విసర్జన చేయడం, వచ్చిపోయే వారిని వెకిలిచేష్టలతో వేధించడంతో మహిళలు, యువతులు, విద్యార్థినులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఇది సుల్తానాబాద్‌లోని రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న వైన్స్‌షాపు ఎదుట పరిస్థితి. రోడ్డును ఆనుకుని అస్తవ్యస్తంగా వాహనాలు పార్క్ చేశారు. దీని ద్వారా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. అయినా, పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు.



రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ ప్రధాన చౌరస్తాలోనిదీ వైన్స్ షాప్. దీనికి పర్మిట్ రూమ్ ఉన్నా.. మందుబాబులు ఇలా రోడ్డుపైనే కూర్చొని మద్యం తాగుతున్నారు. ఆ మత్తులో గొడవ పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించేవారికి తీవ్రఅంతరాయం కలిగిస్తున్నారు.



మంథనిలోని పెద్దపల్లి రోడ్డులోనిదీ దృశ్యం. దీనికి అతి సమీపంలోనే బొక్కలవాగు, తమ్మిచెరువు, ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయి. ఇక్కడి మైదానంలో మందుబాబులు ఇలా బహిరంగంగా సిట్టింగ్ ఏర్పాటు చేశారు. సాయంత్రం వాకింగ్ వెళ్లే మహిళలు మందుబాబుల ఆగడాలతో ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి రోడ్డులోని బెల్ట్‌షాప్ ఎదుట పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.



ఇది పెద్దపల్లి జెండా చౌరస్తాలోని చిత్రం. సొంత ఊళ్లకు వెళ్లేందుకు ఆటోస్టాండ్‌లో ఇలా నిరీక్షిస్తున్నారు. జనావాసాల మధ్య వైన్స్‌షాప్ ఉండడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- జనావాసాల్లోనే మద్యం దుకాణాలు
- యథేచ్ఛగా సాగుతున్న బెల్ట్‌షాప్‌లు
- బార్‌లను తలపిస్తున్న వైన్స్ దుకాణాలు
- రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్న మహిళలు, యువతులు

సాక్షి, పెద్దపల్లి: చిత్తుగా మద్యం తాగుతున్న మందుబాబులు ఆ మత్తులో ఊగుతూ.. తమను తాము మైమరచిపోతున్నారు.. అంతటితో ఆగకుండా ఎక్కడపడితే అక్కడే మూత్రవిసర్జన చేస్తున్నారు.. అటుగా వచ్చివెళ్లే మహిళలు, యువతులు, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. బార్‌లు, వైన్స్‌షాపుల్లోని పర్మిట్ రూముల్లో తాగాల్సిన మందుబాబులు.. వీటి సమీపంలోని గద్దెలు, రహదారులు, ఓపెన్‌ప్లాట్లు, ఆటోలను అడ్డాలుగా చేసుకుని చిత్తుగా మద్యం తాగుతున్నారు. బెల్ట్‌షాపుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఉదయం ప్రారంభమయ్యే వైన్స్.. రాత్రుల్లో బార్‌లను తలపిస్తున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు వైన్స్, బార్‌ల వద్ద పరిస్థితులను 'సాక్షి' విజిట్ చేసింది. ఆ వివరాలు..

ఇష్టారాజ్యంగా నిర్వహణ

జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో రహదారుల సమీపంలోని వైన్స్ ఎదుట వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తున్నారు. ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రమైతే.. వైన్స్ ఎదుట పరిస్థితి జాతరను తలపిస్తోంది. రోడ్డుపైనే ఏర్పాటు చేసిన కొన్ని మద్యం దుకాణాలతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ నుంచి కొన్ని టేబుళ్లకే సిట్టింగ్‌కు అనుమతి తీసుకొని.. పరిమితికి మించి టేబుళ్లు వినియోగిస్తున్నారు.

సగానికిపైగా మద్యం మత్తు కేసులే..

జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో సగానికిపైగా మద్యం మత్తులో జరిగిన నేరాలే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. జల్సాలకు, మద్యానికి బానిసలైన వారు.. నేరాలకు తెగబడుతున్నారు. మద్యం మత్తులో క్షణికావేశానికి గురవుతున్న మందుబాబులు.. రోడ్డుపై వచ్చిపోయే మహిళలను వేధిస్తున్నారు.

సమ్మె చేసుడే..

- సై అంటున్న సింగరేణి కార్మికులు
- వెనుకాడబోమంటున్న ఎన్టీపీసీ ఉద్యోగులు
- ఆర్‌ఎఫ్‌సీఎల్, కేశోరాం సిబ్బంది సైతం
- బ్యాంకులు, ఎల్‌ఐసీ ప్రతినిధులు కూడా
- 20న సార్వత్రిక సమ్మె
- ఆందోళనలు ఉధృతం చేసిన కార్మిక సంఘాల నాయకులు



పారిశ్రామిక ప్రాంతంలో ఉద్యోగులు(కాంట్రాక్టు కార్మికులతో కలిపి)

సింగరేణి	ఎన్టీపీసీ	ఆర్‌ఎఫ్‌సీఎల్	అల్ట్రాటెక్(కేశోరాం)
77,000	5,290	1,480	1,325

(బ్యాంక్‌లు, ఎల్ఐసీ, రైల్వే, సంఘటిత, అసంఘటిత రంగంలోని ఉద్యోగులు అదనం)

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులు, ఉద్యోగులు, సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మికులు ఈనెల 20న సమ్మె చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం వివిధ యూనియన్లు కార్యాచరణను అమలు చేస్తున్నాయి. ఒకరోజు సమ్మెతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ప్రభుత్వ పరిశ్రమలతోపాటు ప్రైవేట్ సంస్థలపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. కోల్‌బెల్ట్‌లోని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, కేశోరాం పరిశ్రమల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుందని అంటున్నారు. బ్యాంక్‌లు, ఎల్ఐసీ కార్యాలయాల్లోనూ కార్యకలాపాలు స్తంభించే అవకాశం ఉందంటున్నారు. బీజేపీ అనుబంధ బీఎంఎస్ సమ్మెకు దూరంగా ఉండగా.. జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ సమ్మె విజయవంతానికి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా సవరించేందుకు కేంద్రప్రభుత్వం చేస్తున్న కుట్రలను వ్యతిరేకించాలనే తదితర డిమాండ్లతో సమ్మెకు పిలుపునిచ్చాయి.

గేట్‌మీటింగ్‌ల ద్వారా ప్రచారం..

ఉద్యోగులు, కార్మికులు టోకెన్ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. దీనికోసం ఆయా ప్రాంతాల్లో గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తూ కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేస్తున్నాయి. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్, విప్లవ కార్మిక సంఘాలు ప్రచారం ముమ్మరం చేశాయి.

బొగ్గుగనుల్లో కార్మిక చట్టాలు రద్దు..

బొగ్గు గనుల్లో కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లను ప్రవేశ పెట్టారని, దీనిద్వారా కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని యూనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పర్మినెంట్ కార్మికులతోనే బొగ్గు వెలికితీతలు పనులు చేపట్టాలని ఆ సంఘాలు కోరుతున్నాయి.

సింగరేణిలో ప్రధాన డిమాండ్లు ఇవే..

- రద్దు చేసిన కార్మిక చట్టాలను కొనసాగించాలి.
- వాటిస్థానంలోని కోడ్‌ల విధానం రద్దు చేయాలి.
- సింగరేణి సంస్థ యంత్రాలు, కార్మికులతోనే బొగ్గు వెలికి తీత పనులు చేపట్టాలి.
- సత్తుపల్లి ఓసీపీలో ప్రైవేట్ సంస్థ వెలికి తీస్తున్న ఓబీ(మట్టి)ని సింగరేణి స్థలంలో పోయడానికి అవకాశం ఇవ్వవద్దు.
- తాడిచర్ల–2, వెంకటాపూర్ బొగ్గు గనులను సింగరేణి సంస్థకే ఇవ్వాలి.
- సింగరేణికి రావాల్సిన రూ.40వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి.
- కొత్త బొగ్గు గనులు తవ్వించి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

కొత్త గనులు రావాలి



కొత్త బొగ్గుగనులు రావాలి. కొత్త ఉద్యోగాలు ఇవ్వావాలి. టెండర్లను రద్దు చేయాలి. కోల్‌బ్లాక్‌లను సింగరేణి సంస్థకే కేటాయించాలి. కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలి. ఇందుకోసం ఈనెల 20న సమ్మె చేసుడే.

– బోగె సతీశ్‌బాబు, జనరల్ అసిస్టెంట్, జీడీకే–5 ఓసీపీ

సమ్మెతోనే హక్కులు



సమ్మెతోనే కార్మికుల హక్కులు సాధ్యం. కార్మిక చట్టాలు యథావిధిగా కొనసాగించాలి. లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించేలా కేంద్రప్రభుత్వం ఆదేశించాలి. సమ్మెలో పాల్గొని విజయవంతం చేస్తాం.

– చింతల అంజి, ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు

లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్‌లతో మా హక్కులన్నీ పోతాయి. కార్మిక చట్టాలను యథాధావిధిగా ఉంచాలి. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. విద్య, వైద్యం అందజేయాలి. ఒకరోజు సమ్మెతో కేంద్రం దిగివస్తుంది.

– రత్న శ్రీనివాస్, మెకానిక్, ఆర్‌ఎఫ్‌సీఎల్

రేపు కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఈనెల 6న జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. ఆదివారం నియోజకవర్గంలోని మున్సిపల్, మూడు మండలాల నాయకులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సమావేశానికి పెద్దసంఖ్యలో కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు హాజరవుతారని ఠాకూర్ వివరించారు.

వీహెచ్‌పీ నేతల నిరసన



డిపో ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవడంతోపాటు పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నేతలు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో ఎదుట ఆదివారం ధర్నా చేశారు. డీఎం నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. వీహెచ్‌పీ విభాగ కార్యదర్శి అయోధ్య రవి మాట్లాడుతూ, బస్టాండ్‌లో హిందూ దేవతలను దూషిస్తూ మతప్రచారం చేయడం సరికాదన్నారు. మతమార్పిడిలను అడ్డుకోవాలని డిమాండ్‌చేశారు. మ్యాడగోని రవీందర్, సంపత్ యాదవ్, రాజు, సంపత్, లింగన్న, రాజు, శ్రీధర్‌కుమార్, దిగంబర్, అంజయ్య, అరవింద్, వెంకటేశ్, రమేశ్‌యాదవ్, అనిరుధ్ ఉన్నారు.



ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లిలో..



ధర్మారం మండలం రచ్చపల్లిలో..



ఓదెల మండలం జీలకుంటలో..

'మరుగు'న పడుతున్నాయి..

సంపూర్ణ పారిశుద్ధ్య సాధన, మల, మూత్రరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆశయానికి గండిపడుతోంది. పల్లెవాసుల అవసరాల కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు వినియోగించేవారు లేక నిరుపయోగంగా మారాయి. సర్పంచుల పదవీకాలం ముగియడం, ప్రత్యేకాధికారుల పాలన రావడంతో పల్లెలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రధానంగా సామూహిక మరుగుదొడ్లు ఎందుకూ పనికిరాకుండాపోతున్నాయి. వాటిని వినియోగంలోకి తేవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

బీజేపీని బలోపేతం చేద్దాం

- నిర్మల్ జిల్లా మాజీ అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి



సమావేశమైన అంజుకుమార్‌రెడ్డి, రఘునాథ్

పెద్దపల్లిరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ నిర్మల్ జిల్లా మాజీ అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీజేపీ సంస్థాగత సంరచన జిల్లాస్థాయి వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా సంస్థాగత సంరచన ప్రభారీ ఎర్రవెల్లి రఘునాథ్‌తో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఓటర్లకు బీజేపీతో అనుబంధం పెంచేలా వ్యూహాత్మకంగా వ్యవహరించేలా కార్యకర్తలకు శిక్షణ ఇస్తోందన్నారు. సంస్థాగత పరిపక్వతను పెంచి ఓటర్లు బీజేపీ వైపు ఆకర్షితులయ్యేలా చూడాలని అన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పాటుపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, నాయకులు కందుల సంధ్యారాణి, ఠాకూర్ రాంసింగ్, పర్శ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలు

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మంథని: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నిన కుట్రలను పటాపంచలు చేసి ప్రజలకు వాస్తవాలను వివరించడానికి నియోజకవర్గంలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి తీరంలో సోమవారం ఉదయం 11 గంటలకు చర్చా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తెలిపారు. బీఆర్ఎస్ మండలి ఫ్లోర్ లీడర్ మధుసూదనాచారి, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, దావ వసంతతోపాటు సాగునీటి నిపుణుడు వీరమల్ల ప్రకాశ్ హాజరవుతారని ఆయన అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న కుట్ర లపై ఇందులో కూలంకశంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజలు, మేధావులు, తెలంగాణవాదులు హాజరై కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను, వాస్తవ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

విషపురుగు కాటుకు వ్యక్తి మృతి

సారంగాపూర్(జగిత్యాల): రోళ్ళవాగు ప్రాజెక్టు వద్ద ఎండ్రికాయలు పడుతుండగా పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బీర్‌పూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నందగావ్ గ్రామానికి చెందిన గణపతిదేవ్‌రావు టార్పే (34) తన స్నేహితుడు సూర్యభాను మారుతితో కలిసి శనివారం ఎండ్రికాయలు పట్టేందుకు బీర్‌పూర్ శివారులోని రోళ్ళవాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎండ్రికాయలు పడుతున్న క్రమంలో చీకటిగా ఉండడంతో విషపురుగు కాటువేసింది. వెంటనే సూర్యభాను మారుతి 100కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని గణపతిదేవ్‌రావు టార్పేను 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా నిర్మల్ జిల్లా సరిహద్దుల్లోని మహారాష్ట్ర ప్రాంతానికి చెందినవారు జీవనోపాధి కోసం ఇక్కడి వచ్చి ఎండ్రికాయలు పట్టుకుని వెళ్తుంటారని పోలీసులు తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

హుజూరాబాద్: కోతుల దాడిలో ఆదివారం మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివరాలు.. పట్టణంలోని విద్యానగర్ మూడో రోడ్‌లో కోతుల మంద భారీ సంఖ్యలో తిరుగుతూ పుల్లూరి త్రివేణిని తీవ్రంగా గాయపరిచాయి. కోతులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మున్సిపల్ అధికారులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

శివలింగం, నంది విగ్రహం లభ్యం


శివలింగం, నందివిగ్రహం

చొప్పదండి: మండలంలోని దేశాయిపేట గ్రామ చెరువు వద్ద ఆదివారం నంది, శివలింగం విగ్రహాలు లభ్యమయ్యాయి. విషయం తెలిసిన గ్రామస్తులు విగ్రహాల వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తున్నారు. విగ్రహాలు లభ్యమైన చోటనే శివాలయం నిర్మించాలని కొందరు అభిప్రాయం వ్యక్తం చేయగా పూజారులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని మరి కొందరు అన్నారు. ఆలయ నిర్మాణానికి వేరే స్థలం తీసుకొని విగ్రహాలు ప్రతిష్ఠించాలని గ్రామంలోని నాయకులు పేర్కొన్నారు.

డబ్బులతో ఉడాయించిన వ్యాపారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో బట్టల వ్యాపారులుగా స్థిరపడ్డ రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు అందినకాడికి అప్పు చేసి రూ.50లక్షలతో రాత్రికిరాత్రే ఉడాయించారు. విషయం తెలుసుకున్న రుణదాతలు లబోదిబోమంటున్నారు. బాధితులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. రాజస్థాన్‌లోని నాగుల్‌కు చెందిన గుమాన్ రాచర్ల గొల్లపల్లిలో బట్టల వ్యాపారిగా స్థిరపడ్డాడు. మరొకరితో కలిసి వ్యాపారం కోసమని స్థానికుల నుంచి రూ.లక్షల్లో అప్పు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా పలు చిట్టీలను ఎత్తుకున్నారు. ఇద్దరు కలిసి సుమారు రూ.50లక్షలకు పైగా అప్పులు చేసి గుట్టుచప్పుడు ఉడాయించారు. మూడు రోజుల క్రితమే వారు గ్రామాన్ని విడిచి పరారీ కాగా.. విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో అప్పులు ఇచ్చిన వారు తల పట్టుకుంటున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పరారీ అయిన వ్యాపారుల కోసం గాలిస్తున్నారు. అప్పులిచ్చిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

'ఎన్‌రైప్'తో మామిడి 'పండు'

- కాయలను పండుగా మార్చే పౌడర్
- మామిడి మార్కెట్లో చైనా పౌడర్లు వాడుతున్నట్లు ప్రచారం
- కాల్షియం కార్బైడ్‌ను నిషేధించిన ప్రభుత్వం
- ఎన్‌రైప్ పౌడర్ విక్రయాలకు సర్కార్ అనుమతి



ఆగ్రోస్ కేంద్రాల్లో విక్రయించే 'ఎన్‌రైప్' ప్యాకెట్లు


మామిడి అట్టపెట్టెలో పండుగా మార్చే నిషేధిత కాల్షియం కార్బైడ్ ప్యాకెట్లు

జగిత్యాలఅగ్రికల్చర్: మామిడికాయలను పండుగా మార్చేందుకు చాలా చోట్ల వ్యాపారులు విషపూరితమైన కాల్షియం కార్బైడ్, చైనాపౌడర్‌లను వాడుతున్నారు. ఇటీవల జగిత్యాల (చల్‌గల్) మామిడి మార్కెట్ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించే కాయల్లో కాల్షియం కార్బైడ్ కలిగిన చైనాపౌడర్లు వాడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాంటి పండ్లను తింటున్న వినియోగదారులు క్యాన్సర్ బారిన పడుతుండడంతో ఆరోగ్య సంస్థ, హైకోర్టు కాయను పండుగా మార్చే రసాయనాలను నిషేధించింది. దీంతో కాయను పండుగా మార్చేందుకు ఎన్‌రైప్ అనే సేంద్రియ పౌడర్‌ను ఉపయోగిస్తున్నారు. ఎన్‌రైప్‌ను ఉపయోగించాలని ఉద్యాన శాఖ ప్రచారం చేస్తుండగా, ఆగ్రోస్ సంస్థ ఆ పౌడర్‌ను మార్కెటింగ్ చేస్తుంది.

పండ్లలో రారాజు..

పండ్లలో రారాజు మామిడిలో అన్ని రకాల పోషకాలు ఉండడంతో ప్రతి ఒక్కరూ తినేందుకు ఇష్టపడుతుంటారు. గతంలో పక్వానికి వచ్చిన కాయలను గడ్డి, మామిడి ఆకు కింద మాగబెట్టేవారు. అప్పుడు మామిడిపండ్లు రుచిగా, నాణ్యతగా ఉండేవి. కాగా, మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి వ్యాపారులు రసాయనాలతో పండుగా మార్చడం మొదలుపెట్టారు. దీంతో మామిడి పండుతో లాభం కంటే నష్టం ఎక్కువగా జరగడంతో ప్రభుత్వం రసాయనాలను నిషేధించింది.

అట్టపెట్టెల్లో చైనా ప్యాకెట్లు

చల్‌గల్ మామిడి మార్కెట్ నుంచి పంజాబ్, హరియాణా, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ఎక్కువగా మామిడికాయలు ఎగుమతి చేస్తారు. జగిత్యాల నుంచి ఢిల్లీ వెళ్లాలంటే లారీకి రెండురోజులు పడుతోంది. సదరు కాయలను అక్కడి వ్యాపారులు పండుగా మార్చాలంటే మరో నాలుగైదు రోజులు పడుతోంది. దీంతో వ్యాపారులు త్వరగా మార్కెటింగ్ చేసుకోవాలనే ఉద్దేశంతో ఆయా రాష్ట్రాలకు పంపే మామిడికాయల అట్టపెట్టెల్లో చైనాపౌడి ప్యాకెట్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. కాయను పండుగా మార్చే పౌడర్లను ప్రభుత్వం నిషేధించింది. దీనికి తోడు, చాలా మంది పక్వానికి రాని కాయలను విక్రయిస్తుండడంతో వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు, ఢిల్లీ వెళ్లేవరకు కాయ నాణ్యత చెడిపోతుండడంతో వాటికి సైతం పౌడర్లు వాడుతున్నారు.

ఎన్‌రైప్‌కు ప్రభుత్వ అనుమతి

సహజ సిద్ధమైన స్టార్చ్(గంజి)లో ఉండే ఇథలిన్, మాడ్చిన కొబ్బరిచిప్పల పొడితో 'ఎన్‌రైప్' పౌడర్‌ను తయారు చేస్తారు. ఈ పౌడర్‌తో కాయ పండుగా మారినా రుచి, నాణ్యతలో తేడా ఉండదు. ఈ మేరకు బెంగళూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రిసెర్చ్ సంస్థ ఆమోద ముద్ర వేయగా, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి ఇవ్వగా, తెలంగాణలో ఎన్‌రైప్‌ను అమ్మేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

పండుగా ఎలా మార్చుతుందంటే..

ఎన్‌రైప్ ప్యాకెట్ రూ.పదికి మార్కెట్లో దొరుకుతోంది. ఒక ప్యాకెట్ ద్వారా 10–15 కిలోల మామిడి కాయలను పండుగా మార్చవచ్చు. పక్వానికి వచ్చిన కాయలను అట్టపెట్టెలో పెట్టి అందులో నాలుగైదు చోట్ల చిన్నరంధ్రాలు చేసిన ఎన్‌రైప్ ప్యాకెట్‌ను వేసి గాలి తగలకుండా సీల్ చేయాలి. ఎన్‌రైప్ ద్వారా నాలుగైదు రోజుల పాటు అవసరమైన ఇథలిన్ గ్యాస్ విడుదలై కాయ పండుగా మార్చుతుంది.

తనిఖీలు నిర్వహించాలి



మామిడి మార్కెట్‌తో పాటు రోడ్డు వెంట ఉన్న షెడ్లు, మామిడి విక్రయాలు చేసే దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించాలి. కాల్షియం కార్బైడ్, చైనాపౌడర్లు వాడటంపై స్పష్టమైన నిబంధనలు పాటించాలి. ఆరోగ్యం కోసం తినే మామిడిపండు మనిషి అనారోగ్యానికి గురయ్యేలా తయారయితే ఏం లాభం.

– సత్యనారాయణరెడ్డి, ధర్మపురి

ప్రభుత్వ అనుమతితోనే ఎన్‌రైప్..



ప్రభుత్వ అనుమతితోనే ఎన్‌రైప్ విక్రయాలు జరుగుతున్నాయి. అగ్రోస్ సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. మామిడికాయను ఎన్‌రైప్‌తో పండుగా మార్చవచ్చు. ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావు. కాల్షియం కార్బైడ్, చైనాపౌడిని ప్రభుత్వం నిషేధించింది.

– శ్యాంప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

పవర్ లిఫ్టర్లు

- పతకాల సాధనలో క్రీడాకారిణులు
- ఉత్తరాఖాండ్‌లో అంతర్జాతీల పోటీలు
- నేటి నుంచి ఈనెల 12 వరకు నిర్వహణ
- రాష్ట్ర వ్యాప్తంగా 15 మందిలో నలుగురు ధర్మపురి వాసులే


పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఐశ్వర్య (ఫైల్)

ధర్మపురి: చదువుతో పాటు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చాటుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన స్వప్నిక, ఎస్.ఐశ్వర్య, కుమ్మరి పూజిత, భూక్య శ్రావణి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 12 వరకు ఉత్తరాఖాండ్‌లో జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీలకు తెలంగాణ నుంచి మొత్తం 15 మంది ఎంపిక కాగా, వారిలో జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన నలుగురు ఎంపికయ్యారు. వీరంతా మండలంలోని మగ్గిడి మోడల్ కళాశాలలో చదివారు. ప్రస్తుతం ఇద్దరు కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్నారు. ఐశ్వర్య, భూక్య శ్రావణికి ఫేస్‌బుక్ మిత్రులు (ఎన్నారైలు) రూ.1.16 లక్షలు, కుమ్మరి పూజితకు వీరా జిమ్ నిర్వాహకుడు నరేశ్ రూ.12 వేలు ఆర్థికసాయం అందించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



అమ్మానాన్న కవిత, రాజయ్య వ్యవసాయ కూలీలు. మోడల్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదువుతున్న. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి చేరుకుంటా.

– పూజిత, కమలాపూర్, ధర్మపురి

పతకం సాధిస్తా



మాది మండలంలోని నక్కలపేట. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని రైల్వే ఉద్యోగం చేయడం లక్ష్యం. మగ్గిడి మోడల్ స్కూల్ పీఈటీ రాజేందర్ శిక్షణలో ఈ స్థాయికి ఎదిగిన. తప్పకుండా పతకంతో వస్తా.

– భూక్య శ్రావణి, నక్కలపేట, ధర్మపురి

మనిషికి చిటికెడంతా ప్రేమ అవసరం

- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్


పురస్కారాలు ప్రదానం చేస్తున్న నలిమెల భాస్కర్, కవులు

కరీంనగర్‌కల్చరల్: కూడు, గూడు, బట్టలాగే ప్రేమ కూడా మనిషికి కనీస అవసరమేనని, కవిత్వ పఠనంతో మనిషికి చిటికెడంతా ప్రేమైనా అందాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల వేదిక, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు నిర్వహణలో సాహిత్య పురస్కారాల సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాధేయ మాట్లాడుతూ, కవిత్వాన్ని ప్రేమించే తాను సృజనకారులను ప్రోత్సహించడానికి 37 ఏళ్లుగా పురస్కారాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన వైష్ణవశ్రీకి సత్యదేవి సాహిత్య పురస్కారం, వరంగల్ కవి నందకిషోర్‌కు ఉమ్మడిశెట్టి సతీశ్‌కుమార్ యువ పురస్కారం, తిరుపతికి చెందిన సుధామురళికి రాజయ్య కవితా పురస్కారాన్ని నలిమెల చేతులమీదుగా ప్రదానం చేశారు. అలాగే కరీంనగర్‌కు చెందిన యుగంధర్ కవితా సంపుటి 'ఇదేమి యుద్ధం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవులు అన్నవరం దేవేందర్, సీవీ కుమార్, కందుకూరు అంజయ్య, గాజోజు నాగభూషణం, నడిమెట్ల రామయ్య, విలాసాగరం రవీందర్, తోట నిర్మలరాణి, పెనుగొండ సరసిజ, రామానుజం సుజాత, నీలగిరి అనిత, నసీరుద్దీన్, నెరువట్ల చైతన్య, కూకట్ల తిరుపతి, మోర అనిల్, పీఎస్ రవీంద్ర, బీవీఎం స్వామి, గుండు రమణయ్య, గాజుల రవీందర్, ప్రేమసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన మంటలు.. తప్పిన ప్రమాదం


రైస్‌మిల్‌కు సమీపంలో మంటలు


కథలాపూర్(వేములవాడ): మండలంలోని ఊట్‌పెల్లి గ్రామశివారులో శనివారం రాత్రి పిచ్చిమొక్కలకు నిప్పంటుకొని మంటలు చెలరేగడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. పిచ్చిమొక్కలకు అంటుకున్న మంటలు వ్యాపించి గ్రామశివారులోని రైస్‌మిల్, పెట్రోల్ బంక్ సమీపం వరకు చేరుకున్నాయి. గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. ఎస్సై నవీన్‌కుమార్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ప్రజలను అప్రమత్తం చేశారు. మెట్‌పల్లి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలార్పేసింది. అగ్నిప్రమాదంలో రైస్‌మిల్, పెట్రోల్ బంక్‌కు ఎలాంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ఈశ్వర.. పరమేశ్వర..

వేములవాడ: రాజన్నను ఆదివారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మండుతున్న ఎండలను లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.





వేసవి దుక్కి.. పంటకు పుష్టి

- పంట కొయ్యలు కాల్చేస్తే ప్రమాదమే
- తొలకరికి ముందు లోతు దుక్కులు మేలు
- ఏటవాలుగా దున్నితే మరింత శ్రేయస్కరం


దుక్కి చేస్తున్న రైతు

కరీంనగర్ అర్బన్: శాస్త్రవేత్తల మాటలు కాకుండా సొంత నిర్ణయాలే పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పంట కొయ్యలు కాలకుండా కలియదున్నడం, వేసవిలో లోతు దుక్కులతో ఎంతో ప్రయోజనం. పురుగులు, తెగుళ్ల, కలుపును నివారించుకోవడంతో పాటు భూమిపొరల్లో వర్షపునీరు ఇంకి పంటకు ఉపయోగపడుతుంది. వేసవిలో లోతు దుక్కుల ఉపయోగాల గూర్చి కరీంనగర్ వ్యవసాయ పరిశోధనస్థానం హెడ్ డీన్ డా.జి.మంజులత వివరించారు. వేసవి దుక్కులకు ఏప్రిల్, మే నెలలు అనుకూలం, వేసవి దుక్కులను అడ్డం, పాడువు సాళ్లతో కాకుండా ఏటవాలుగా దున్నడం శ్రేయస్కరం.

ఏటవాలు దుక్కితో ప్రయోజనాలనేకం

ఏటవాలుగా దున్నడం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతుగా దున్నినపుడు భూమిలోపలి పొరల్లో ఉన్న క్రిమికీటకాలు సూర్యకిరణాలతో చనిపోతాయి. వేసవి దుక్కుల్లో తొలకరి వర్షాలు కురిసినపడు విత్తనాలు వేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. తొలకరి వర్షాలకు ముందే రెండుసార్లు దున్నితే గట్టిగా ఉన్న భూమి గుల్లబారడంతో పాటు కలుపు నివారించుకోవచ్చు. వర్షం నీరు భూమిలోకి చొచ్చుకొనిపోతోంది, భూమి పొరల్లోకి గాలి చేరుతుంది. సూక్ష్మజీవుల సాంద్రత, సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది. దీంతో భూమిలోని పోషకాలను మొక్క గ్రహించడానికి అనుకూలంగా ఉంటుంది. కలుపు, పురుగు మందుల అవశేషాలకు మొక్కలు తీసుకోవు. భూమి వర్షపునీటిని తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. గాలిలో ఉన్న నత్రజని వర్షపునీటితో కలిసి భూమిలోకి చేరడం వల్ల భూసారం పెరుగుతుంది. పురుగుమందులు, తెగుళ్ల మందులకయ్యే పెట్టుబడిని తగ్గించుకోవచ్చు. హానిచేసే బాక్టీరియాను నాశనం చేయొచ్చు.

వరికొయ్యలు కలియదున్నాలి

వరి కోతలు పూర్తయ్యాక కొయ్యలను తగులబెడుతుంటారు. దీనివల్ల భూమి సారం కోల్పోతుంది. అలా కాకుండా వరి కొయ్యలను నీటిలో నాన్చి దున్నడం లేదా బీడులోనే కలియదున్నితే నేలలో పోషక విలువలు పెరుగుతాయి. పత్తి రైతులు కాల్చివేయకుండా కలియదున్నాలని శాస్త్రవేత్తలు స్పష్టం సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవాలి.

7 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- కరీంనగర్, గోదావరిఖని, వేములవాడ, జగిత్యాలలో నిర్వహణకు కేడీసీఏ రెడీ
- ఈ నెల 6 లోపు దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం


గతేడాది శిక్షణ శిబిరంలో క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రికెట్‌లో ఓనమాలు నేర్పించేందుకు హెచ్‌సీఏ, కేడీసీఏ శ్రీకారం చుట్టాయి. గతంలో మూడు జిల్లాల్లోనే శిబిరాలు నిర్వహించగా, ఈ ఏడాది నుంచి జగిత్యాలలో శిబిరాన్ని ప్రారంభించనున్నారు. నిష్ణాతులైన కోచ్‌ల సమక్షంలో శిక్షణ ఇవ్వనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగంరావు, ఎన్.మురళీధర్‌రావు తెలిపారు. ఈనెల 7 నుంచి జూన్ 6 వరకు శిబిరాలు నిర్వహిస్తారు. ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని క్రికెట్ సంఘం బాధ్యులు తెలిపారు.

13 నుంచి 23 ఏళ్ల వారికి..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధమైన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిబిరాలు నిర్వహిస్తారు. 13 నుంచి 23 ఏళ్ల బాలబాలికలు, పురుషులకు, మహిళలకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

దరఖాస్తు ఇలా..

క్రీడాకారులు ఫొటో, ఆధార్‌కార్డుతో సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. కరీంనగర్ వావిలాలపల్లిలోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫాంతో రావాలి. మిగిలిన కిట్ శిబిరంలో ఇస్తారు. ఒక్కో శిబిరంలో 100 నుంచి 120 మంది క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ముందుగా దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం దక్కుతుంది.


రాణించినవారు హెచ్‌సీఏ టోర్నమెంట్‌లో..

శిక్షణ శిబిరాల్లో రాణించిన క్రీడాకారులకు మంచి అవకాశాలు దక్కనున్నాయి. శిబిరం అనంతరం జూన్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ టీంలను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. అండర్– 14,16,19,23 విభాగాల్లో జట్లను ఎంపిక చేసి హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ సంఘం) ఆధ్వర్యంలో జరుగనున్న టోర్నమెంట్‌లకు పై జట్లను పంపించనున్నారు.

శిబిరాలు నిర్వహించే ప్రదేశాలు

- కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదురుగా ఉన్న క్రికెట్ అసోసియేషన్ మైదానం, సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల మైదానంలో శిబిరాలు జరుగుతాయి. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 86887 68775 (శ్రావణ్‌కుమార్)
- పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలోని జీఎం గ్రౌండ్‌లో శిక్షణ శిబిరం జరగనుంది. సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్ 98663 51620 (కిరణ్‌కుమార్)
- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని 2వ బైపాస్‌లో గల స్వర్గీయ నర్సింగరావు మైదానంలో శిబిరం జరుగనుంది. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 91772 59935 (రాజు)
- జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీస్టేడియం లేదా ఎస్కేఎన్ఆర్ కళాశాల మైదానంలో తొలిసారిగా శిక్షణ శిబిరం జరుగనుంది. సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్ 99480 64712 (జలపతి)

క్రికెటర్లుగా ఎదిగేందుకు అవకాశం



క్రికెట్ అంటే చిన్నారులకు ఎంతో ఇష్టం. చాలా మంది పిల్లలు మైదానాలు, గల్లీలో క్రికెట్ ఆడుతంటారు. వీరందరు క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే శిబిరాల్లో పాల్గొనాలి. అత్యాధునిక పద్ధతుల్లో కోచ్లు ట్రెనింగ్ ఇస్తారు. క్రికెటర్లుగా ఎదగాలనుకునే చిన్నారులు శిబిరాల్లో శిక్షణ తీసుకుంటే చాలా బాగుంటుంది.

– వి.ఆగంరావు, క్రికెట్ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఏటీఎంలో నగదు కాజేసేందుకు కుట్ర


ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఏటీఎంలో నగదు కాజేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు కుట్రపన్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు, ఏటీఎం నిర్వాహకుల వివరాలు.. నగరంలోని క్రిస్టియన్‌కాలనీలోని ఎస్బీఐ ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం ప్రవేశించి, ఏటీఎం మిషన్ తలుపుతెరిచి, డబ్బు కాజేసేందుకు పరికరాన్ని అమర్చారు. ఉన్నతాధికారులు సీసీ ఫుటేజీ ద్వారా గమనించి, ఏటీఎం చానల్ ఎగ్జిక్యూటర్ రజినీకాంత్‌కు సమాచారమిచ్చారు. ఆయన పోలీసుల కు ఫిర్యాదు చేయగా, సీఐ సృజన్‌రెడ్డి ఏటీఎంను పరిశీలించారు. నగదు డ్రా చేసినవారి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

అత్తపై కోడలు దాడి


వృద్ధురాలిని స్టేషన్‌కు తీసుకెళ్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

జగిత్యాలక్రైం: అత్తపై కోడలు కత్తితో దాడిచేయగా, కేకలు వేయడంతో స్థానికులు కాపాడి సఖి కేంద్ర నిర్వాహకులకు అప్పగించారు. స్థానికుల వివరాలు.. జిల్లా కేంద్రంలోని జంబిగద్దె ప్రాంతానికి చెందిన పెండ్యాల భాగ్య సంతానం లేకపోవడంతో వినయ్ అనే వ్యక్తిని పెంచుకుంది. అతడికి అఖిల అనే యువతితో వివాహం జరిపించింది. కాగా, కొన్నేళ్లుగా అత్తను అఖిల శారీరకంగా, మానసికంగా వేధిస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న బోరు వేయాలని అఖిల అత్తకు సూచించగా, ఆమె మరిచిపోయింది. దీంతో ఆగ్రహించిన కోడలు ఇంట్లోని కత్తితో అత్తపై దాడిచేయగా వీపు, ముఖంపై స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు జిల్లా సంక్షేమశాఖాధికారి నరేశ్‌కు సమాచారం అందించగా, వెంటనే సఖి నిర్వాహకులు లావణ్య, సామాజిక కార్యకర్త శారద చేరదీసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్సై గీత వృద్ధురాలి కోడలు, కొడుకును పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సఖి కేంద్ర నిర్వాహకులు వృద్ధురాలిని ఆమె ఇంటికి తరలించారు.